104) రామక్రియ

ప॥ ఎంత లేదు చిత్తమా యీతలేల మోతలేల । వంతులకు బొరనేల వగరించనేలా ॥

చ॥ దక్కనివి గోరనేల తట్టుముట్టు పడనేల । చిక్కి నంతకే సంతసించ రాదా ।
ఒక్క మాటే వుప్పుదిని వుపదాప మందనేల । చక్క జూడ దగినంతే చవి గొనరాదా ॥

చ॥ పారి పారి వేడ నేల బడలిక పడనేల । మీరిదైన మిచ్చినంతే మెచ్చరాదా ।
వీరిడై పొడవెక్కి విరుగ బడగనేల । చేరి యుండినంతకే చేచాచరాదా ॥

చ॥ జీవులుగొలువనేల సిలుగుల బడనేల । శ్రీవేంకటేశుడాత్మ జిక్కి వుండగా ।
దావతి పడగనేల దప్పుల బొరలనేల । కైవశమైనందుకే గతి గూడ రాదా ॥